విజృంభిస్తున్న జ్వరాలు

- కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
- ప్రభుత్వ ఆస్పత్రిలో 350కి పెరిగిన ఓపీ పేషెంట్లు


ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న బాధితులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నారులతో పాటు పెద్దలు సైతం వైరల్ ఫీవర్ బారిన పడి ఇబ్బందులు పాలవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల కారణంగా ఆస్పత్రిలోని వార్డులు రోగులతో నిండిపోతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గత నెలలో వంద మంది కూడా దాటని ఓపీ పేషెంట్లు వారం రోజులుగా 350 మంది పైబడి ఓపీ పేషెంట్లు వచ్చారు.

వీరిలో 30 శాతం వరకు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతున్నప్పటికి చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులలో చేరి వైద్యం పొందుతుండడంతో జేబులు గుల్లవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతోనే..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో పాటు, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోకపోవడం, బయట ఆహారం సేవించడం వల్ల జ్వరాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు సూచిస్తున్నారు. కలుషితమైన నీటిని తాగడం వల్ల ఎక్కువగా వాంతులు, విరోచనాలు అవుతాయని అన్నారు. ఈగలు, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని, పోషకాహారం, పండ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జ్వరంతో ఇబ్బందిగా ఉంది



జ్వరంతో ఇబ్బందిగా ఉండడంతో ఆస్పత్రికి వచ్చాను. నీరసంగా ఉండడంతో ఆస్పత్రిలో చేరాను. రెండు రోజులుగా వైద్యం పొందుతున్నాను. కొంచెం తక్కువగా ఉంది. జ్వరం తగ్గగానే పంపుతామని సిబ్బంది తెలిపారు. – సాబేరా, వెల్లుట్ల

మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాను..



మూడు రోజులుగా జ్వరం తక్కువ కాక పోవడంతో ఆస్పత్రిలో చేరాను. రెండు రోజుల నుంచి సెలైన్ ఎక్కించడం వలన కొంత జ్వరం తగ్గింది.

– రాములు, రత్నాపూర్

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూ సాధారణంగా వంద మంది వచ్చే ఓపీ పేషెంట్లు 350కి చేరాయి. ప్రతిరోజు వార్డులలో రోగులు వైరల్ ఫీవర్లతో చేరి చికిత్స పొందుతున్నారు. సాధారణ జ్వరాలు మాత్రమే ఉన్నాయి. వైరల్ ఫీవర్ సోకకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. – రవీంద్రమోహన్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్లారెడ్డి

రజకులు రాజకీయంగా ఎదగాలి


మాట్లాడుతున్న రజక సంఘం నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రజకులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజయ్య అన్నారు. క్రిష్ణాజీవాడి గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరాలయం ఆవరణలో గురువారం కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని రజక సంఘాలు ఒకే వేదిక మీదికి రావాలని, పోరాటం కోసం అందరూ రజక బిడ్డలు సంసిద్ధం కావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని, ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, కోశాధికారి జుగాడి సంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'


మద్నూర్‌లో సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు సంఘం నేతలు

మద్నూర్(జుక్కల్): బిచ్కుందలో ఈ నెల 21న నిర్వహించే మున్నూరుకాపు సింహ గర్జనకు మండలంలోని మున్నూరుకాపులు తరలిరావాలని మున్నూరుకాపు సంఘ పెద్దలు కోరారు. మండల కేంద్రంలోని మున్నురుకాపు సంఘంలో గురువారం మున్నూరుకాపు సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. మున్నూరుకాపుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సంవత్సరానికి రూ.5 వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి కుల వృత్తుల సహాయం కింద రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. మున్నురుకాపుల పేరు చివరన పటేల్ అని ప్రభుత్వమే గెజిట్ చేయాలని పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమి పండుగను రైతు పండగగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించి అధికారికంగా జరపాలన్నారు.

ఘనంగా జాతీయ భాషాదినోత్సవం


బాన్సువాడలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గులాం ముస్తఫా


లింగంపేట కేజీబీవీలో సంత నిర్వహిస్తున్న విద్యార్థులు

సాక్షినెట్‌వర్క్: జాతీయ భాష హిందీ దివస్‌ను గురువారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు, అధ్యాపకులను సన్మానించారు. హిందీ భాష ప్రాముఖ్యత గురించి వక్తలు వివరించారు. లింగంపేట కేజీబీవీలో విద్యార్థులు నాటిక ద్వారా కూరగాయల సంత కార్యక్రమం నిర్వహించారు. హిందీలో కూరగాయల పేర్లు, వాటి ధర ప్రదర్శించి విక్రయించారు. హిందీ భాష ప్రాముఖ్యతను తెలియజేసే కరపత్రాలను భిక్కనూరు మండలం జంగంపల్లి ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.


సదాశివనగర్: హిందీ అధ్యాపకులను సన్మానం


జంగంపల్లి ఉన్నత పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అటవీ సంపదను కాపాడాలి



మాచారెడ్డి(కామారెడ్డి): అటవీ సంపదను ప్రతి ఒక్కరూ కాపాడాలని మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన అక్కాపూర్‌లో గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అటవీ సంపదను కొల్లగొడితే కేసులు బనాయించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మద్యానికి బానిస కావద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. గ్రామస్తులు బాబు, రమేశ్, వెంకటరెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

ఇంటి నుంచే భోజనం..



కామారెడ్డి రూరల్ : పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించకపోవడంతో ఇంటినుండే టిఫిన్ బాక్సులు తీసుకెళ్తున్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో ఇంటి నుండి పాఠశాలకు టిఫిన్ బాక్సు తీసుకెళ్తున్న విద్యార్థిని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

ఒకరి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన బేగరి సాయిలు(25) చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స చేస్తున్న సమయంలో సాయిలు మూత్రం కోసం బయటకువెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నగదుసాయం అందజేత

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన షేక్ మహిమూదా బేగం కుమార్తె ఆఫ్రీన్ వివాహానికి మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ సాయిరాం, ఉప సర్పంచ్ గంగారాం, నాయకులు నారాగౌడ్, నాగనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య


మద్నూర్‌లో ఎడ్లు, ఆవులకు హారతి ఇస్తున్న రైతు కుటుంబం


ఎడ్లను ఊరేగిస్తున్న రైతులు


సర్వలో పశువులను ముస్తాబు చేస్తున్న రైతులు


నాగుల్‌గావ్‌లో పూజిస్తున్న సర్పంచ్ కపిల్ పటేల్

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ఎడ్ల పొలాల అమావాస్య పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆవులు, ఎడ్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. మట్టితో తయారు చేసిన బసవన్నలను ఇంట్లో పెట్టి పూజలు చేశారు. ఎడ్లు లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో ఆలయాల చుట్టూ ట్రాక్టర్లు తిప్పారు.


బిచ్కుందలో ..


తాడ్వాయిలో ఎడ్లను పూజిస్తూ..


సదాశివనగర్‌లో ఎడ్లకు పూజలు..


దేవునిపల్లిలో ఎడ్లను ఆలయాల చుట్టూ తిప్పుతూ..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్ అప్రజాస్వామికం


లింగంపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు


తాడ్వాయిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

లింగంపేట/తాడ్వాయి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని, శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం అన్యాయమని బీజేపీ నాయకులు అన్నారు. అరెస్ట్‌కు నిరసనగా గురువారం లింగంపేట, తాడ్వాయి మండలాల్లో రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేశారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్‌ను ఆ హామీలు అమలు చేయాలని ఉపవాస దీక్ష చేస్తుంటే, కేంద్ర మంత్రిని అని చూడకుండా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని స్థానిక బీజేపీ నాయకులు విమర్శించారు.

కనీస వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను నెరవేరుస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల శిబిరంలో ఆయన మాట్లాడారు. సమ్మెకు మద్దతు ప్రకటించారు.అలాగే మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరంలో కూడా మాట్లాడారు. ఎండీఎం కార్మికులకు పెంచిన వేతనాలను విడుదల చేయాలని, స్లాబ్ రేట్లను పెంచాలని, గుడ్డుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు భోజనం అందించలేని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


ఎల్లారెడ్డిలో మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు


లింగంపేటలో మద్దతు తెలుపుతున్న నేతలు


మద్నూర్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

సాక్షి నెట్‌వర్క్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నాలుగు రోజులుగా అంగన్‌వాడి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల్లో గురువారం బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. దోమకొండ ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయాన్ని ఐదు మండలాలా అంగన్‌వాడి సిబ్బంది ముట్టడించారు. బాన్సువాడలో అంబేడ్కర్ విగ్రహానికి డిమాండ్లతో కూడిన మెమోరాండం అందజేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.


దోమకొండలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం ముట్టడించిన అంగన్‌వాడీలు


బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లా గ్రంథాలయసంస్థ సహకారంతో మండల కేంద్రంలోని నాగిరెడ్డిపేట శాఖా గ్రంథాలయానికి, మండలంలోని పోచారం గ్రామంలో పఠన మందిరానికి గురువారం జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పోచారంలోని గ్రామపెద్దల సమక్షంలో పుస్తకాలను పఠన మందిరంలో ప్రదర్శించారు. నిరుద్యోగ యువత పోటీపరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సూచించారు. ఆయన వెంట మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్, గ్రామపెద్దలు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మంత్రితో భేటి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే సురేందర్ హైదరాబాద్‌లో గురువారం భేటీ అయినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వాటి తీరుతెన్నులపై ఎమ్మెల్యేతో మంత్రి సమావేశం నిర్వహించినట్లు వారు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శోభారాణి



పిట్లం(జుక్కల్): రెడ్ క్రాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారానికి శోభారాణి ఎంపిక య్యారు. పిట్లం మండలంలోని మద్దెలచెరువు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా శోభారాణి విధులు నిర్వహిస్తున్నారు. ఆమె గతంలో కూడా మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీఈవో రాజు చేతుల మీదుగా శోభారాణి, ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారాన్ని అందుకోనున్నారు.

మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామంలో మురికినీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ సూచించారు. బ్రాహ్మణపల్లిలో గురువారం మురికి నీటితో నిండిన గుంతలను ఆయన పరిశీలించారు. గ్రామంలో మురికి నీరు నిల్వ ఉంటే ప్రజలు రోగాల బారిన పడతారని అన్నారు. వెంటనే మురికి నీటి గుంటలను తొలగించాలని సూచించారు.

పాఠశాలకు గ్రీన్ బోర్డు వితరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గురువారం రాజేశ్వర్‌గౌడ్, గ్రీన్ బోర్డు వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు దామోదర్ తెలిపారు. పాఠశాలలో బోర్డు కొరత ఉన్నట్లు రాజేశ్వర్‌గౌడ్‌కు తెలుపగా ఆయన వెంటనే స్పందించి గ్రీన్ బోర్డు, స్టాండు కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు. దాతకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆరు నెలలుగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు లీకేజీ అవుతుంది. దింతో తాగు నీరు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా మరమ్మతులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తం

పౌష్టిక ఆహారం పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): దూప్ సింగ్ తండా అంగన్‌వాడి కేంద్రంలో గురువారం గ్రామ సర్పంచ్ చందర్‌రాథోడ్ చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు పౌష్టిహారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు కడావత్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బిల్లులు..

బాన్సువాడ రూరల్: నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని రాజేశ్వర్ తండాకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన డబుల్‌బెడ్‌రూం ఇంటి బిల్లులను గురువారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు పోచారం సురేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీపీ పాల్త్య విఠల్ స్థానిక నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ పాల్త్య విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీవో రాము, నాయకులు ప్రతాప్ సింగ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్ ఉన్నారు.

కామారెడ్డి తరలిరావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఈ నెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమానికి తాడ్వాయి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

బాన్సువాడ రూరల్: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ బాన్సువాడ గ్రామీణ మండల అధ్యక్షుడు వడ్ల శేఖర్ అన్నారు. గురువారం బాన్సువాడలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, మండల కార్యవర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. ఆయన వెంట మాజీ అధ్యక్షులు సాయిబాబ ఉన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడెగాంలో గురువారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా న్యూట్రిషన్ ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవాల్సిన పండ్లను అందజేశారు. ఉప సర్పంచ్ మాచర్ల రాజులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఇస్రోజీవాడీలో ఉచిత హోమియో వైద్య శిబిరం

కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడిలో గురువారం ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల(కామారెడ్డి) ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 160 మందికి పైగా చికిత్సను అందించి వారికి హోమియోపతి మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని సర్పంచ్ కొత్త మమతరాజు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా ఆయుష్ కరదీపకను పంపిణీ చేశారు. డాక్టర్లు విజయలక్ష్మి, దేవయ్య పాల్గొన్నారు.